పర్యావరణ సమతుల్యతను బాధ్యతగా స్వీకరించాలి

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత సురేశ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): పర్యావరణ సమతుల్యతను బాధ్యతగా స్వీకరించాలని, ఆ విషయంలో తెలంగాణ అద్భుత ఫలితాలు సాధించిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇండోనేషియా రాజధాని జకార్తాలో జరిగిన 'గ్రీన్ సౌత్ అలయెన్స్ ఎనర్జీ ట్రాన్సిషన్' సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యావరణం, గ్రీన్‌హౌజ్ ఎఫెక్ట్‌పై కార్యాచరణ రూపొందించకపోతే భవిష్యత్తులో తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలను భాగం చేయాలని, అప్పుడే సత్ఫలితాలు వస్తాయని, అందుకు తెలంగాణ ఒక కేస్ స్టడీగా తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీఎంగా హరితహారం కార్యక్రమానికి రూపకల్పన చేసి ప్రజలను భాగస్వామ్యం చేయటంతో స్వల్పకాలంలోనే తెలంగాణలో గ్రీన్‌కవర్ పెరిగిన విషయాన్ని గుర్తుచేశారు. గ్రీన్‌ఎనర్జీ ట్రాన్సిషన్‌లో భారతదేశం విశేష పురోగతి సాధించిందని, డీకార్బనైజేషన్ కోసం మరింత ముందుకెళ్తుందని చెప్పారు.

మాజీ సర్పంచులపై కక్ష సాధింపులు వద్దు

హైదరాబాద్,నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ సర్పంచులపై కక్ష సాధింపులకు పాల్పడకుండా ఎన్నికల హామీ మేరకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని సర్పంచుల సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతోనే సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కోళ్లమద్ది, నిర్మల్ జిల్లా పెంబి మాజీ సర్పంచ్‌లు ఏనుగుల కేశవరావు, పూర్ణచందర్‌గౌడ్ ఆత్మహత్యాయత్నం చేసి ప్రాణాపాయస్థితిలో ఉన్నారని ఆరోపించారు.

రాజ్యాధికారం దిశగా అడుగెయ్యాలి

- ఓట్లేసి దండాలు పెట్టడం మానుకోవాలి
- దుర్భర పరిస్థితి నుంచి బయటపడాలి
- సంచార జాతులకు సిరికొండ పిలుపు
- సంచార జాతులకోసం పోరాటం: శ్రీనివాస్‌గౌడ్, వకుళాభరణం

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి

ఖైరతాబాద్, నవంబర్ 28: దేశంలోని సంచారజాతులు దుర్భరమైన స్థితిగతుల నుంచి బయటపడాలని, రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని శాసనమండలి పక్ష నేత, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. తెలంగాణ సంచార జాతుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ఓ సంపన్నుడి ఆస్తి కంటే సంచార జాతుల అందరి ఆస్తులు తక్కువగా ఉంటాయని తెలిపారు. సంచార జాతుల్లో 90 శాతం కులాలు చట్టసభల ముఖాలే చూడలేదని, అందులో కొందరికి చట్టసభలు ఉన్నాయన్న విషయమూ తెలియదని తెలిపారు. దేశ జనాభాలో 12 శాతం ఉన్న సంచారజాతులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఓటు అనే ఆయుధంతో ప్రభుత్వాలనే మార్చవచ్చని చెప్పారు. మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం కులగణన సర్వే సమయంలోనే సంచారజాతుల బాగోగుల గురించి ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటుచేసిందని, అత్యంత వెనుకబడిన వారికి సముచిత స్థానం కల్పించిందని గుర్తుచేశారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ చేపడుతున్న సమగ్ర కులగణనలో సంచార జాతులకు కాలమే లేదని, రాష్ట్రంలో వంద శాతం సమగ్ర కులగణన చేశామని ప్రభుత్వం ఎలా చెప్పుకుంటుందని ప్రశ్నించారు. సంచార జాతులను లెక్కించే వరకు అవసరమైతే ఆ వర్గాలతో పోరాటాలు నిర్వహిస్తామని చెప్పా రు. ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూ రి శ్రీనివాస్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ప్రొఫెసర్ తిరుమలి, ప్రొఫెసర్ మురళీ మనోహర్, తెలంగాణ రాష్ట్ర సంచారజాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఓ నరేందర్, విశ్రాంత డీఎస్పీ గంగాధర్, వివిధ సంఘాల నేతలు బత్తుల సిద్దేశ్వర్, పిడికిలి రాజు, వంశరాజ్, మురళీకృష్ణ, కోల శ్రీనివాస్, విశ్వేశ్వరయ్య, రమేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో గ్రేడింగ్ ఎత్తివేత

- ఇంటర్నల్ మార్కుల తొలగింపు
- మళ్లీ 100 మార్కులకు పరీక్షలు
- ఇక నుంచి 24 పేజీల బుక్‌లెట్
- ఎస్సెస్సీ మార్కుల ఆధారంగా ఇంటర్‌లో అడ్మిషన్లు
- ఇంటర్ ఫస్టియర్‌లో 'దోస్త్' తరహా ఆన్‌లైన్ ప్రవేశాలు
- ఇందుకోసమే ఎస్సెస్సీలో గ్రేడింగ్‌కు స్వస్తి

హైదరాబాద్,నవంబర్ 28 (నమస్తేతెలంగాణ): పదో తరగతి పరీక్షల విధానంలో పాఠశాల విద్యాశాఖ కీలక మార్పులు చేసింది. గ్రేడింగ్ విధానానికి స్వస్తి పలికింది. ఇప్పటివరకు ఉన్న 20 ఇంటర్నల్ మార్కులను ఎత్తివేసింది. మొత్తం 100 మార్కులకు పరీక్షలు నిర్వహించాలని నిర్ణయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త విధానాన్ని 2024-25 విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని అధికారులను ఆదేశించింది. అలాగే ఐదు పరీక్షలకు 24 పేజీల బుక్‌లెట్(ఆన్సర్‌షీట్)ను ఇవ్వనుండగా, సైన్స్ సబ్జెక్ట్‌కు మాత్రం ఫిజికల్ సైన్స్‌కు 12 పేజీలు, బయాలజికల్ సైన్స్‌కు 12 పేజీల చొప్పున బుక్‌లెట్లను అందజేయనున్నారు. ఈ దిశగా చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్నల్ మార్కుల కేటాయింపులో పారదర్శకత కొరవడిందని ఆరోపణలు వచ్చాయి. కొంద రు ఉపాధ్యాయులు ఉద్దేశపూర్వకంగా కొంద రు విద్యార్థులకు ఎక్కువ, మరికొందరికి తక్కువ మార్కులు వేస్తున్నారనే విమర్శలు వచ్చాయి. దీంతో ఈ పద్ధతిని పాఠశాల విద్యాశాఖ తొలగించింది.

వచ్చే ఏడాది నుంచి ఇంటర్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్లు

2025-26 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. పదో తరగతి మార్కుల ఆధారంగా ఇంటర్ ఫస్టియర్‌లో సీట్లు కేటాయిస్తారు. ఇందుకోసమే పదో తరగతిలో గ్రేడింగ్ విధానాన్ని రద్దుచేసి, మార్కుల విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్లను (దోస్త్ పోర్టల్ ద్వారా) ఆన్‌లైన్‌లోనే చేపడుతున్నారు. ఇంటర్‌లో విద్యార్థులు సాధించిన మార్కులు, మెరిట్ ఆధారంగా విద్యార్థుల నుంచి ఆప్షన్లు స్వీకరించి, సీట్లు కేటాయిస్తున్నారు. రాష్ట్రంలో కేసీఆర్ సర్కారు హయాం(2015) నుంచే ఈ విధానం విజయవంతంగా అమలవుతున్నది. ప్రైవేట్ కాలేజీల ఆగడాలకు అడ్డుకట్టపడింది. ఇదే తరహాలో ఇంటర్‌లోనూ ఆన్‌లైన్ అడ్మిషన్లు చేపట్టాలన్న డిమాండ్లున్నాయి. అయితే పదో తరగతిలో అమలుచేస్తున్న గ్రేడింగ్ ఆధారంగా ఇంటర్‌లో సీట్లు కేటాయించలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో పదో తరగతిలో నిరంతర సమగ్ర మూల్యాంకనం, గ్రేడింగ్ పద్ధతిని రద్దుచేశారు. కొత్తగా ఈ మార్కుల విధానంతో ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల అడ్మిషన్ దందాకు చెక్‌పడనుంది. ఆన్‌లైన్ అడ్మిషన్లతో విద్యార్థి తనకు నచ్చిన కాలేజీలో.. నచ్చిన చోట చేరేవీలుంటుంది.

గ్రేడింగ్ తొలగింపును స్వాగతిస్తున్నాం

పదో తరగతిలో గ్రేడింగ్ విధానం తొలగింపును స్వాగతిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు పీ రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి, కోశాధికారి తుకారం అన్నారు. ఇంటర్నల్ మార్కుల తొలగింపు విద్యార్థుల ఉన్నతికి మేలు చేస్తుందని, ఉపాధ్యాయులపై కూడా భారం తగ్గి బోధనపై దృష్టిపెట్టే అవకాశం కలుగుతుందని గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. మిగిలిన తరగతులకు కూడా ఈ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తిచేశారు.

లంచం డబ్బులతో ఏఈ కార్తీక్

మాజీ సర్పంచ్ నుంచి పీఆర్ ఏఈ లంచం

- పట్టుకున్న ఏసీబీ అధికారులు

సుబేదారి, నవంబర్ 28: పంచాయతీరాజ్ ఏఈ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ వరంగల్ రేంజ్ డీఎస్పీ పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కడారిగూడెం మాజీ సర్పంచ్ మంద సంపత్ ఏడాదిన్నర క్రితం రూ.10 లక్షల పీఆర్ నిధులతో సీసీ రోడ్డు పనులు చేశారు. బిల్లుల కోసం వరంగల్ జిల్లా పీఆర్ డిపార్ట్‌మెంట్ డ్రాయింగ్ విభాగంలో పనిచేస్తున్న ఏఈ గాదె కార్తీక్‌ను సంప్రదించగా రూ.5 వేలు లంచం డిమాండ్ చేశాడు. గురువారం హనుమకొండలోని హరిత హోటల్‌లో ఏఈ కార్తీక్ రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం వరంగల్ జడ్పీ కార్యాలయంలోని డ్రాయింగ్ గదికి తీసుకువెళ్లి ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఇంగ్లిష్ ఇష్టంలేక విద్యార్థిని ఆత్మహత్య

అనూశ్రీ (ఫైల్)

భీమారం, నవంబర్ 28 : ఇంగ్లిష్ మీడియం చదవడం ఇష్టం లేక ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోతన్‌పల్లిలో జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. పోతన్‌పల్లికి చెంది న లాటుకూరి బానేశ్-కవితకు ఇద్దరు సంతానం కాగా, అనుశ్రీ (16) పెద్ద కూతురు. రామకృష్ణాపూర్‌లోని కస్తుర్బాలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. పది వరకు తెలుగు మీడియం చదివింది. ప్రస్తుతం ఇంగ్లిష్ మీడియం కావడంతో ఇబ్బంది పడుతూ వచ్చింది. తెలుగుమీడియంలో చేర్పించాలని తండ్రికి పలు మార్లు చెప్పింది. రెండో సంవత్సరంలో తెలుగు మీడియంలో చేర్పిస్తానని తండ్రి చెప్పాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు మంచిర్యాల దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో పదేండ్ల బాలిక మృతి

సమన్విత

దండేపల్లి (జన్నారం), నవంబర్ 28 : మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రోటిగూడకు చెందిన దిగుట్ల సమన్విత (10) గుండెపోటుతో మరణించింది. దిగుట్ల నాగరాజు-అనూష దంపతుల కుమార్తె సమన్విత జన్నారంలోని కృష్ణవేణి పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. గురువారం సాయంత్రం సమన్వితకు గుండెపోటు రాగా, దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందింది.

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి

సతీశ్ (ఫైల్)

డోర్నకల్, నవంబర్ 28: కలకత్తా ఆర్మీ బేస్ క్యాంపులో విధులు నిర్వహిస్తున్న మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన ఆర్మీ జవాన్ కొదిరిపాక సతీశ్ (34) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీశ్ తండ్రి కనకయ్య చిన్నతనంలో మృతి చెందగా, తల్లి ఎల్లాబాయి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నది. సతీశ్ 2011లో ఆర్మీకి ఎంపికయ్యాడు. నాలుగేండ్ల క్రితం నర్సంపేటకు చెందిన లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. కలకత్తా ఆర్మీ బేస్ క్యాంపులో ఉద్యోగం చేస్తూ మంగళవారం గుండెపోటు రావడంతో పశ్చిమబెంగాల్ బాగ్ దోగారా దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయన భౌతికకాయం శుక్రవారం సాయంత్రం డోర్నకల్‌కు చేరుకుంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పింఛన్ పెంచాలని దివ్యాంగుల ధర్నా

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దివ్యాంగుల పింఛన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి నెరవేర్చకపోవడంతో దివ్యాంగులు ఆందోళనకు దిగారు. సూర్యాపేటలోని ప్రధాన రహదారిపై గురువారం ధర్నా చేశారు. వికలాంగుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నయీమ్ మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్ పింఛన్ మొత్తాన్ని పెంచకుండా.. ఇచేఉ్ప రూ.4 వేల పింఛన్‌ను రెండు నెలలకోసారి ఇస్తున్నట్టు మండిపడ్డారు. – సూర్యాపేట టౌన్

ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలని గోదాము ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

గోదాం గేట్‌కు తాళం వేసి రైతుల నిరసన

మక్తల్, నవంబర్ 28 : ధాన్యం కొనుగోలు చేసేందుకు రైతులను ఇబ్బందులకు గురిచేయడంతో గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ మండలం రుద్రసముద్రం గిడ్డంగుల గోదాం వద్ద రైతులు ఆందోళనకు దిగారు. మక్తల్‌తోపాటు మాగనూర్, కృష్ణ మండలాల నుంచి రైతులు ధాన్యాన్ని లారీల్లో నింపుకొని రైస్‌మిల్లర్ల వద్దకు వెళ్తే ధాన్యాన్ని తీసుకొని బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వలేదు. దీంతో రైతులు ధాన్యాన్ని గిడ్డంగుల గోదాంకు తీసుకెళ్లారు. అధికారులు ధాన్యం తీసుకోవాలంటే సరైన తూకం ఉండాలని లారీలను బయటనే నిలబెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూసిన రైతులు లారీలను అన్‌లోడ్ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంతో విసుగుచెంది గిడ్డంగుల గోదాం గేట్‌కు తాళం వేసి నిరసన చేపట్టారు. దీంతో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సుదర్శన్ జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ స్పందించి మక్తల్ నుంచి వచ్చిన 15 లారీల ధాన్యాన్ని నారాయణపేటకు పంపిస్తారని, అన్‌లోడ్ చేయించి ఇబ్బంది లేకుండా చూడాలని నారాయణపేట రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డికి సూచించారు. దీంతో రైతులు శాంతించి నిరసనను విరమించారు.

ధాన్యం కొనేందుకు వారం వెయిటింగ్

- కాంటాల ఆలస్యంతో రైతుల ఇబ్బందులు
- గేట్లకు తాళాలు వేసుకుంటున్న అధికారులు

మార్కెట్‌కు తాళం వేయడంతో నిలిచిన వాహనాలు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 28 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనడానికి కనీసం వారం రోజులు పడుతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం వ్యాపారులు కాంటాలు ఆలస్యం చేయడంతో ఎటు చూసినా ధాన్యం కుప్పలే దర్శనమిచ్చా యి. బయ్యారం, గార్ల, కురవి, డోర్నకల్ నుం చి వచ్చిన రైతులు రాత్రి చలిలో వణుకుతూ మార్కెట్లోనే పడిగాపులు కాస్తున్నారు. అధికారులు మార్కెట్‌కు ధాన్యం తీసుకురాకుండా గేట్లకు తాళాలు వేస్తున్నారని వాపోతున్నారు.

కాంటా ఎప్పుడైతదో తెల్వదు

మార్కెట్ తెచ్చిన ధాన్యానికి కాంటా ఎప్పుడు పెడతారో తెలియని పరిస్థితి ఉంది. మార్కెట్‌లో వడ్లు పోసి వారం రోజులైతంది. ఇంకా కాంటా కాలేదు. అధికారుల దగ్గరకు పోయి అడిగితే వ్యాపారులు రాలేదని చెప్తా్రను. త్వరగా కాంటాలు పెట్టి రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలె.

– హరినాథ్, రైతు, ఇర్సులాపురం

అరిగోస పడుతున్నాం

ఈ ఏడాది వడ్లు పండించి అరి గోస పడుతున్నం. పంట తీసుకొచ్చి మార్కెట్లో పోసినం. కాంటాలు ఎప్పుడు చేస్తరో తెలియదు. వ్యాపారులు వచ్చి పాట ఎప్పుడు వేస్తారో, వడ్లు ఎప్పుడు అమ్ముడు పోతాయోనని గందరగోళంగా ఉంది. మార్కెట్ అధికారులు కాంటాలు టైముకు చేయాలె.

– ద్వాలీ, రైతు, మల్యాల

బెయిల్ ఇస్తే శ్రవణ్‌ను విచారించొచ్చు కదా?

పోలీసులకు హైకోర్టు ప్రతిపాదన

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడైన ఒక టీవీ చానల్ ఎండీ ఏ శ్రవణ్‌కుమార్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తామని, శ్రవణ్ పోలీసులకు లొంగిపోయాక విచారణ చేయవచ్చు కదా? అని హైకోర్టు పోలీసులకు ఒక ప్రతిపాదన చేసింది. శ్రవణ్‌కుమార్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు ముగిసిన దశలో హైకోర్టు జోక్యం చేసుకుని, నిందితుడికి బెయిల్ మంజూరు చేసి కోర్టులో లొంగిపోవాలని ఉత్తర్వులు ఇస్తామని చెప్పింది. ఈ విధంగా జరిగితే పిటిషనర్ శ్రవణ్‌కుమార్ లొంగిపోతే న్యాయవాది సమక్షంలో విచారణ చేపడతారా? అని పోలీసుల తరఫున వాదిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ప్రశ్నించింది. దీనిపై పీపీ పల్లె నాగేశ్వర్‌రావు స్పందిస్తూ.. హైకోర్టు సూచనపై కేసు దర్యాప్తు అధికారుల వివరణ తీసుకుని శుక్రవారం చెప్తామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ శ్రవణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి విచారణ చేపట్టారు. ఇరు పక్షాల వాదనలు ముగిసిన అనంతరం తీర్పును తర్వాత వెలువరిస్తామని న్యాయమూర్తి ప్రకటించారు.

4 వరకు భుజంగరావు మధ్యంతర బెయిల్ పొడిగింపు

ఫోన్ ట్యాపింగ్ కేసులో మూడో నిందితుడైన మాజీ అదనపు ఎస్పీ ఎన్ భుజంగరావు మధ్యంతర బెయిల్‌ను డిసెంబర్ 4 వరకు పొడిగిస్తూ గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మేకల తిరుపతన్న బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్నది. సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసిన కారణంగా భుజంగరావు బెయిల్ పిటిషన్‌పై ఇక్కడి విచారణను వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. హెల్త్‌గ్రౌండ్స్‌పై గతంలో ఇచ్చిన బెయిల్‌ను పొడిగించేందుకు కింది కోర్టు నిరాకరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

కాంగ్రెస్ నాయకుడి చీటింగ్

- భూమి విక్రయిస్తానని పది లక్షలు తీసుకొని మోసం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు, ఎమ్మెల్యే
- ఆత్మహత్యకు దివ్యాంగుల యత్నం

పెట్రోల్ బాటిల్‌తో రాజమ్మ, రాజు

నల్లబెల్లి, నవంబర్ 28: కాంగ్రెస్ నాయకుడి మోసంతో బాధిత దివ్యాంగులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన గురువారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లబెల్లికి చెందిన గొర్రెల కాపరి నానెబోయిన కుమారస్వామి 2020లో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. భార్య రాజమ్మ, కుమారుడు రాజు దివ్యాంగులు కావడంతో గొర్రెలను కాసే పరిస్థితి లేక తమ 100 గొర్రెలను విక్రయించగా రూ.6 లక్షలు వచ్చాయి. ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బత్తిని మహేశ్ తన 38 గుంటల భూమిని అమ్ముతానని తెలపడంతో, ఆ భూమి కొనుక్కొని దానిపై ఆధారపడి జీవిస్తామనే యోచనతో తమ దగ్గర ఉన్న రూ. 6 లక్షలకు తోడు మరో రూ. 4 లక్షలు అప్పుచేసి కొనుగోలు చేశారు. రూ. 10 లక్షలు తీసుకుని అగ్రిమెంట్ కాగితంలో తప్పుడు సర్వే నంబర్ వేయడంతో పాటు నాలుగేండ్లుగా భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా వేధించాడు. దీంతో బాధితులు తమకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌తో పాటు నర్సంపేట ఏసీపీ, సీపీకి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సైతం గోడు వెల్లబోసుకున్నారు. రెండు నెలలైనా న్యాయం చేయకపోవడంతో తమకు చావే శరణ్యమని గ్రామపంచాయతీ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు వారించడంతో బాధితులు రాజు, అతడి తల్లి రాజమ్మ ఆందోళనను విరమించుకున్నారు. తహసీల్దార్ కృష్ణను వివరణ కోరగా బాధితుల ఫిర్యా దు రికార్డులో నోట్ చేసుకున్నామని చె ప్పారు. ఈ భూమిని ఇతరులకు రిజిష్ట్రేష న్ చేయబోమని, బాధితులు కోర్టును ఆశ్రయిస్తే వారి ఆదేశాల మేరకు భూమిని హోల్డ్‌లో పెట్టడా నికి కలెక్టర్‌కు అథారిటీ ఉంటుందని తెలిపారు.

ఏడాది పనితనం ఎట్లున్నది?

మొదటిపేజీ తరువాయి...

కొంతమంది యువకులతో కూడిన బృందాలు సర్వే నిర్వహించాయి. రేవంత్‌రెడ్డి ఏడాది పాలన ఎలా ఉంది? అనే ప్రశ్నతో మొదలై మీ ప్రాంతం ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా? కేసీఆర్ పాలనతో పోల్చినప్పుడు రేవంత్‌రెడ్డి పాలన ఎలా ఉంది? వంటి 35 ప్రశ్నలతో సమాచారం సేకరించారు. కాంగ్రెస్ హామీలు ఏ మేరకు అమలు చేశారు? ప్రతిపక్షాలపై సీఎం చేస్తున్న విమర్శలను ప్రజలు ఎలా స్పందిస్తున్నారు? సీఎంగా రేవంత్‌రెడ్డికి ఎన్ని మార్కులు వేస్తారు? రేవంత్‌రెడ్డి కాకుండా వేరే ఎవరైనా సీఎంగా ఉంటే ఎలా ఉంటుంది? అనే ప్రశ్నలను అడిగినట్టు సర్వేలో పాల్గొన్న వాళ్లు చెప్తున్నారు. ఎర్రపహాడ్, చిల్పకుంట్ల గ్రామాల్లో రేవంత్‌రెడ్డి ఏడాది పాలన ఎలా ఉంది? అని ఎన్యూమరేటర్లు అడిగిన ప్రశ్నకు 'తూతూ మంత్రం తుమ్మకాయ పాలన' అన్నట్టే ఉందంటూ కొందరు వ్యంగ్యంగా స్పందించినట్టు తెలిసింది.

మా నోట్లె మన్నుబోసిండు!

ఏడాదిలో ఎన్ని సంక్షేమ పథకాలు అందాయనే వివరాలను కూడా సర్వేలో సేకరించారు. "పింఛన్ పెంచుతా అని పెంచకపాయే. కొత్త పింఛన్లు లేకనేపోయే ఇంక ఆయన చేసింది ఏముంది?" అని ప్రజలు నిట్టూర్చినట్టు తెలుస్తున్నది. మూసీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలంటూ రెడ్ మార్క్ వేసిన కుటుంబాల నుంచి కూడా సమాచారం సేకరించారు. ఇక్కడ పూర్తిస్థాయిలో ప్రజలు రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగానే స్పందించినట్టు సమాచారం. "మేం కొనుక్కున్న ఇండ్ల మీదికి హైడ్రాను తీసుకొచ్చి మా నోట్లె మన్నుబోసిండు. మంత్రులు, పెద్ద మనుషులు కూడా మార్కు దాటి కట్టిండ్రని రేవంత్ రెడ్డే చెప్పిండు కదా! వాళ్ల ఇండ్లు ఎందుకు కూల్చుతలేరు? అని ఎన్యూమరేటర్లను ప్రజలు ఎదురుప్రశ్నించినట్టు తెలిసింది.

సర్వేలు చేయిస్తున్నదెవరు?

కాంగ్రెస్ ఏడాది పాలనపై ప్రధానంగా రెండు పెద్ద సంస్థలు నిర్వహిస్తున్న సర్వేలపై గాంధీభవన్ వర్గాలు, ప్రజల్లో ఆసక్తికర చర్చ జరుగుతున్నది. జాతీయ స్థాయిలో పేరున్న ఓ సంస్థ కూడా సర్వే నిర్వహిస్తున్నది. సీఎంగా ఓ మంత్రి అయితే ఎలా ఉంటుం ది? అని ఎన్యూమరేటర్లు అడిగితే 'ఆయనొద్దు.. ఈయనొద్దు కేసీఆరే మళ్లీ రావాలని జనం చెబుతున్నారని తెలిసింది. సర్వే సంస్థ అధినేతను 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి సంప్రదించగా సర్వే నిర్వహిస్తున్న మాట వాస్తవమే అని స్పష్టంచేశారు. సర్వేలో అడుగుతున్న ప్రశ్నలు, ఫలితాలను డిసెంబర్ రెండోవారంలోగా వెల్లడిస్తామని చెప్పారు. స్వచ్ఛందంగా సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కానీ దక్షిణ తెలంగాణకు చెందిన సీనియర్‌మంత్రే సర్వే చేయిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఆ మంత్రే చేయించారా లేక అధిష్ఠానం ఆదేశాల మేరకు సర్వే చేయిస్తున్నారా? అని రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తున్నది.

దిగుబడి రాక.. రైతు ఆత్మహత్య

- రూ.3 లక్షల వరకు అప్పు
- నిర్మల్ జిల్లాలో విషాదం

కాంతయ్య(ఫైల్)

సోన్, నవంబర్ 28 : వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చలేక, గల్ఫ్ వెళ్లి అప్పులు తీర్చుదామని అక్కడి వెళ్లినా పని దొరుకక, తిరిగొచ్చి ఉన్న ఊరిలోనే ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం జాం గ్రామానికి చెందిన నలిమేల కాంతయ్య (43)కు ఎకరన్నర వ్యవసాయ భూమి ఉంది. ఇందులో పత్తి, వరి సాగు చేశాడు. సాగు కోసం రూ.3 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో దిగులు చెందాడు. ఈ నెల 25న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. విశ్వనాథ్‌పేట్ కాలనీలో చెట్టుకు ఉరేసుకున్నాడు. వ్యవసాయంలో నష్టాలు రావడం, గల్ఫ్‌లో పని దొరకక మనస్తాపానికి గురై కాంతయ్య ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్పమాలలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌కు బ్రీత్ అనలైజర్ టెస్ట్

అయ్యప్ప మాలలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌కు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఆర్టీసీ డిపో ఎదుట గురువారం అయ్యప్ప భక్తులు ధర్నా చేశారు. డిపో మేనేజర్ పద్మావతీరెడ్డి అయ్యప్ప స్వామి భక్తులకు క్షమాపణ కోరారు. ఎస్ఐ ఉపేందర్ చేరుకుని భక్తులకు సర్దిచెప్పి సద్దుమణిగేలా చేశారు. – తొర్రూరు

అయ్యప్ప స్వాములకు ముస్లింల భిక్ష

కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని శ్రీ వేంకటేశ్వర మణికంఠ ఆలయంలో అయ్యప్ప మాల ధారులకు ముస్లింలు భిక్ష ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటారు. కరీంనగర్‌లోని ధరూల్ ఖైల్ సొసైటీ సభ్యులు.. సుమారు 150 మంది అయ్యప్ప మాలధారులకు గురువారం భిక్ష ఏర్పాటు చేశారు. ఆరేళ్లుగా నిర్వహిస్తున్నట్టు సభ్యులు తెలిపారు. – చొప్పదండి